మెడికల్ కాలేజీల్లో సమస్యలు



వివరాలు 2లో..

బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ సోమవారం, 19 అక్టోబర్-2026
balagamtv100@gmail.com
పేజీలు-8



# అంబరాన్నంటిన సద్దులు..

- ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు..
- ప్రత్యేక ఆకర్షణగా రష్మిక-విజయ్ జంట
- హోరెత్తిన పెద్ద బతుకమ్మ సంబురాలు..
- ఊరూవాడల్లో ఆడిపాడిన ఆడబిడ్డలు
- ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు..

హైదరాబాద్, అక్టోబర్ 18 : పుడమి పూలవనమైంది. సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్నంటింది. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై తొమ్మిదిరోజుల పాటు సాగిన పూల పండుగ ఆదివారం సద్దులతో వైభవంగా ముగిసింది. తీరొక్క రంగుల పూలతో పేర్చిన బతుక మ్మలతో ఆలయాలు, కూడళ్లు, చెరువు, కాలువల గట్ల వద్దకు చేరుకొని ఆడబిడ్డలు ఆడిపాడారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో' అంటూ ఊరూరా బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.అనంతరం వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. 'పోయిరా గౌరమ్మ పోయిరావమ్మ.. మళ్లొచ్చే ఏడాదికి తిరిగి రావమ్మ' అంటూ వీడ్కోలు పలికిన మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. హనుమకొండలోని పద్మాక్షి గుట్ట, వడ్డేపల్లి చెరువు, వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి చెరువు, రంగలీలా మైదానం, జనగామలోని బతుకమ్మ కుంట, జయశంకర్ భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, ములుగులోని మినీ

బతుకునిచ్చే బతుకమ్మను
అందరొక్కచోట చేరి కొలిచారు.
తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో
పూజించిన గౌరమ్మను చివరి రోజున
గంగమ్మ ఒడికి సాగనంపి
వాయినాలను ఇచ్చిపుచ్చుకొని పాటల
నెమరేతతో ఇండ్లకు కదిలారు.
తెలంగాణ నుదుట సిందూరం..
ఆడబిడ్డల ఆత్మగౌరవ సంరంభం..
సాంస్కృతిక వైభవం.. ప్రకృతిని
ఆరాధించే పర్వమైన 'పెద్ద బతుక మ్మ'
ఉత్సవాలు.. ఎంగిలిపూలతో మొదలై
ఎన్నో మధురానుభూతులను
'సద్దులు' కట్టిచ్చి ఆదివారం
ఘనంగా ముగిసినయ్.



## సోనీది ప్రమాదం కాదు.. ముమ్మాటికీ యాజమాన్య హత్యే



- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆగ్రహం
- బాధితులకు చెరొక రూ. కోటి పరిహారం చెల్లించాలి
- యాజమాన్యంపై నాన్-బెయిలబుల్ కేసులు పెట్టాలని డిమాండ్

వివరాలు 3లో..

## ఐటీ ఉద్యోగులకు కరెంట్ కష్టాలు!



- అప్రకటిత కోతలతో వర్క్ ఫ్రం హోమ్‌కు ఇబ్బందులు
- ఫిర్యాదులు చేసినా పట్టింపు లేని దక్షిణ డిస్కం సిబ్బంది
- కోతలే లేవంటూ సీఎండీ చెప్పిన తీరుపై మండిపాటు
- నిరంతర విద్యుత్ ఇవ్వాలంటూ ఐటీల డిమాండ్ 4లో..

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల్లో కోతలెందుకు?

కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబర్ 18 : కేంద్రం నిధులిస్తున్నా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల జీతాల్లో కోతలు విధించడం ఏమిటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులతో కలిసి ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉండగా, వారి జీతాలను రూ.4-5వేల వరకు తగ్గించడం దుర్మార్గమని అన్నారు. ఒక వైపు ద్రవ్యోల్బ ణంతో ధరలు పెరుగుతూ ఉంటే ఉద్యోగుల జీతాలు ఎలా తగ్గిసారని నిలదీశారు. ఉద్యోగుల పట్ల వివక్ష తగదని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం



ఉద్యోగులు ఒక్క రోజు పని మానేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ దెబ్బ తింటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాలను పెంచి.. రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌసను కవిత సోమవారం సందర్శించనున్నట్లు టీఆర్ఎస్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జీలు

హైదరాబాద్, అక్టోబర్ 18 : మార్చిలో జరిగే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలి పారు. రాష్ట్ర స్థాయిలో 2 వార్ రూమ్‌లనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ ఆయా జిల్లాలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో యువజన కాంగ్రెస్ శ్రేణులను వారు సమన్వయం చేస్తారని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల సూచనల మేరకు బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు.

## మెడికల్ కాలేజీల్లో సమస్యల తాండవం



- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గాలిలో దీపంలా వైద్య విద్య
- మూడేండ్లు పూర్తవుతున్నా 'నో' పర్మినెంట్ బిల్డింగ్స్
- ల్యాబొరేటరీలు, టీచింగ్ ఫ్యాకల్టీలదీ అదే దుస్థితి
- అపార్ట్‌మెంట్లు, మార్కెట్ యార్డుల్లో మెడికల్ కాలేజీలు, హాస్టళ్ల నిర్వహణ
- మౌలిక వసతుల కల్పనలో ఫెయిల్
- రాష్ట్ర ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు

2లో..

## భక్తులపైకి దూసుకెళ్లిన లారీ.. 15మంది దుర్మరణం



- మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఘోర ప్రమాదం
- నవరాత్రుల వేళ శీతలామాత ఆలయం వద్ద విషాదం
- 28 మందికి తీవ్ర గాయాలు.. విచారణకు ఆదేశించిన సీఎం
- పోలీసు ఉన్నతాధికారిపై వేటు.. మరో 8 మంది సస్పెన్షన్
- మృతుల కుటుంబాలకు 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

భోపాల్, అక్టోబరు 18: నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వెళ్తున్న భక్తుల పాలిట ఓ లారీ మృత్యు శకటమైంది. ఆలయానికి వెళ్తున్న భక్తులపైకి దూసుకెళ్లడంతో 15 మంది దుర్మరణం చెందారు. ఇద్దరు పోలీసులు సహా 28 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘోర ప్రమాదం మధ్యప్రదేశ్‌లోని

## హరీశ్ ఆరోపణలు అవాస్తవం





- విజయవంతంగా 'మహాలక్ష్మి ఉచిత బస్సు' పథకం
- దసరాకు 7,000 ప్రత్యేక సర్వీసులు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, అక్టోబర్ 18 : మహాలక్ష్మి పథకం అమలు, పండుగ ప్రత్యేక బస్సుల నిర్వ హణలో ఎలాంటి లోటుపాట్లు లేవని టీజీఎస్ఆ ర్టీసీ స్పష్టం చేసింది. పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీకనుగుణంగా టికెట్ ధరల నియంత్రణ నిర్ణయం ఇప్పుడు తీసుకున్నది కాదని పేర్కొంది. పండుగల వేళ ఆర్టీసీ అధికా రులు టికెట్ల ధరలు పెంచుతు న్నారని, ప్రత్యేక బస్సులు రద్దు చేస్తున్నారని సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ఎల్పీ ఉప నేత టి.హరీశ్ రావు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆది వారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2003 నుంచి ఆర్టీసీ టికెట్ ధరల నియంత్రణ నిర్ణ యం అమల్లో ఉందని పేర్కొంది. సంస్థపై అద నపు భారం పడకుండా నిబంధనలకు లోబడే నిర్ణయాలు తీసుకుంటున్నామని వివరించింది.

బలగం TV BALAGAM



# బీఆర్ఎస్ దెబ్బకు దిగొచ్చిన జీఆర్ఎంబీ..




- ఏపీ ప్రతిపాదనలు తిరస్కరణ
- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల్ని సమీక్షించేది లేదని స్పష్టీకరణ
- 30న బోర్డు18వ సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 18 : బీఆర్ఎస్ దెబ్బతో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) దిగొచ్చింది. తెలంగాణ ప్రాజెక్టులకు మంజూరు చేసిన అనుమతులను రద్దు చేయాలన్న ఏపీ ప్రతిపాదనలను తిరస్కరించింది. ఆ అంశాలను ఎజెండాలో చేర్చేందుకు నిరాకరించింది. వాటి ప్రస్తావన లేకుండానే 30న బోర్డు 18వ సమావేశాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జీఆర్ఎంబీ చైర్మన్ ఇరు రాష్ట్రాలకు సమాచారం అందించారు. వాస్తవానికి ఆగస్టులోనే ఈ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించిన జీఆర్ఎంబీ.. ఎజెండా అంశాలను పంపాలని ఇరు రాష్ట్రాలకు సూచించింది. దీంతో నిబంధనలకు విరుద్ధమైన ప్రతిపాదనలు పంపిన ఏపీ.. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు లేనే లేవని పేర్కొన్నది.

రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరం, సీతారామ, చౌటుపల్లి హనుమంత్‌రెడ్డి తదితర ప్రాజెక్టులకు మంజూరు చేసిన అనుమతులన్నింటినీ పునఃసమీక్షించాలని కోరింది. దీనిపై బోర్డు తెలంగాణ అభిప్రాయాన్ని తీసుకోకుండానే ఆ అంశాలను ఎజెండాలో చేర్చింది. అంతేకాకుండా ఏపీ వాదనలకు అనుగుణంగా నీటి లభ్యతపై అధ్యయనం కోసం టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఎజెండా సిద్ధం చేసింది. దీంతో ఏపీ ప్రతిపాదనలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది.

# రైస్‌మిల్లులో భారీ అక్రమాలు?



## రూ.10.92 కోట్ల ధాన్యం పక్కదారి మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు

నర్వ, అక్టోబర్ 18 : నారాయణపేట జిల్లా నర్వ మండలం రాంపూర్ గేట్ వద్ద ఉన్న సాయిరాం రైస్ మిల్లులో భారీ అక్రమాలు జరిగినట్టు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం 2022-25 వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన బియ్యానికి మిల్లులో ఉన్న నిల్వలకు భారీగా తేడాలు ఉన్నట్టు శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పక్కదారి పట్టిన బియ్యం విలువ రూ.10.92 కోట్ల ఉంటుందని గుర్తించారు.వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రిమినల్ కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్సై రమేశ్‌ను వివరణ కోరగా.. విజిలెన్స్ అధికారులు బియ్యం సరఫరా విషయంలో అక్రమాలు జరిగినట్టు తమకు ఫిర్యాదు చేశారని, దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్టు వెల్లడించారు.

# డైవర్షన్ రాజకీయాలు: మన్నె క్రిశాంక్



హైదరాబాద్, అక్టోబర్ 18 : తెలంగాణలో తీవ్రమవు తున్న సాగు, తాగునీటి ఎద్దడిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చేతగానితనాన్ని, సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ సర్కార్ మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై కక్షపూరిత అబద్ధాలను ప్రచారం చేయిస్తున్నదని మండిపడ్డారు.గతంలో 22ఏ నిషేధిత భూముల వివాదం తలెత్తినప్పుడు కూడా ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ భూములంటూ దుష్ప్రచారం చేశారని తెలిపారు. కొండపోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్లు మళ్లిస్తున్నారంటూ అధికారుల ధ్రువీకరణ లేకుండా కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్న మీడియా బరితెగించి అసత్య కథనాలు ప్రసారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎంపీ వివేక్ వెంకటస్వామికి చెందిన 'వెలుగు' పత్రిక, 'వి6' చానల్‌తో పాటు కాంగ్రెస్ సోషల్ మీడియా ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.

# 14 నుంచి పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్



హైదరాబాద్, అక్టోబర్ 18 : ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి ఆదివారం అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. మొత్తం 53 సబ్జెక్టులకు పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు ఉంటాయని, నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.రోజుకు మూడు సెషన్ల చొప్పున కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు ఉంటాయని తెలిపారు.

ఓయూ వెబ్‌సైట్‌లో నవంబర్ 10 నుంచి హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయని వెల్లడించా రు. హైదరాబాద్‌లోనే పరీక్షాకేంద్రాలు ఉంటాయని, నిర్ణీత సమయానికి 90 నిమిషాల ముందే.. పరీక్షాకే ంద్రా లకు చేరుకొని రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

# దరఖాస్తు చేసుకుంటేనే ఓటు

- రాష్ట్రంలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు
- నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- గత ఏడాది డిగ్రీ చేసినవారు అర్హులేనా?
- ఇతర నియోజకవర్గాలవారూ దరఖాస్తు చేసుకోవచ్చా?
- ఓటర్ల సందేహాలకు సీఈవో సమాధానాలు



హైదరాబాద్, అక్టోబర్ 18 :రాష్ట్రంలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఓటరు జాబితా పునఃసిద్ధత కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో పట్టభద్రుల్లో ఓటు నమోదు ప్రక్రియపై వ్యక్తమవుతున్న సందేహాలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి సమాధాలు చెప్పారు. ఓటు నమోదుకు డిగ్రీ ఎప్పటిలోపు పూర్తిచేసి ఉండాలి? గతంలో ఓటు వేసినవారు మళ్లీ నమోదు చేసుకోవాలా? ఆధార్ తప్పనిసరా? కరీంనగర్‌లో నివసించే పట్టభద్రులు నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చా? దరఖాస్తుతో ఏ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి? వంటి ప్రశ్నలపై 'నమస్తే తెలంగాణ'కు సీఈవో సవివరంగా సమాధానాలు ఇచ్చారు.తెలంగాణలో ప్రస్తుతం మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఓటరు జాబితాలను రూపొందించే ప్రక్రియ చేపట్టినట్టు సీఈవో చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హకు నమోదు చేసుకోవాలనే పట్టభద్రులు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. నవంబర్ 25న ముసాయిదా జాబితా ప్రచురిస్తామని చెప్పారు. పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకొని, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు.

# మెడికల్ కాలేజీల్లో సమస్యల తాండవం

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గాలిలో దీపంలా వైద్య విద్య
- మూడేండ్లు పూర్తవుతున్నా 'నో' పర్మినెంట్ బిల్డింగ్స్
- ల్యాబొరేటరీలు, టీచింగ్ ఫ్యాకల్టీలదీ అదే దుస్థితి
- అపార్ట్‌మెంట్లు, మార్కెట్ యార్డుల్లో మెడికల్ కాలేజీలు, హాస్టళ్ల నిర్వహణ
- మౌలిక వసతుల కల్పనలో ఫెయిల్
- రాష్ట్ర ప్రభుత్వానికి వరుస ఫిర్యాదులు



హైదరాబాద్, అక్టోబర్ 18 : రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. దీంతో వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వైద్య విద్యార్థులు ప్రభుత్వానికి వరుసగా ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రాష్ట్రంలోని ములుగు, ఖమ్మం, కామారెడ్డి, మహేశ్వరం, ఆసిఫాబాద్, నర్సంపేట, నారాయణ్ పేట, జనగామ, మెదక్, కుత్బుల్లాపూర్‌లో మౌలిక వసతులు సరిగా లేక పోవడంతో మెడికల్ స్టూడెంట్స్‌కు ఇక్కట్లు తప్పడం లేదు. కామారెడ్డి మెడికల్ కాలేజీకి పర్మినెంట్ బిల్డింగ్ లేకపోవడంతో కళాశాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు ఎంబీబీఎస్ బ్యాచ్‌లకు కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సరైన హాస్టల్ వసతి లేకపోవడం, హాస్టల్.. కాలేజీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అకాడమిక్ సెషన్స్, క్లినికల్ పోస్టింగ్‌లకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెస్‌కు విద్యార్థులు రూ.3,800 వర కు చెల్లిస్తున్నా.. ఫుడ్ క్వాలిటీ బాగాలేకపోవడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. క్యాంపస్ ఒక్క వాటర్ డిస్పెన్సరీ లేక మంచినీటి కోసం అవస్థలు తప్పడం లేదు.ముగ్గురు మంత్రులున్నా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ప్రభుత్వ మెడికల్ కాలేజీని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పూర్తిస్థాయి కాలేజీ భవన నిర్మాణంలో జాప్యం.. ఆ కళాశాల ఎప్పటి వరకూ పూర్తవుతుందనే స్పష్టత కరువవడంతో వైద్య విద్య గాల్లో దీపంలా మారింది. తాత్కాలిక హాస్టల్ కొనసాగుతున్న భవనంలో మౌలిక వసతులు లేకపోవడం, కాలేజీలో కేవలం మూడు తరగతి గదులు ఉండగా.. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు కనీసం క్లాస్‌రూమ్ లేని పరిస్థితి నెలకొన్నది. ఈ కాలేజీకి బస్సు సౌకర్యం, సెంట్రల్ లైబ్రరీలో వసతులు సరిగా లేవని విద్యార్థులు చెప్తున్నారు. ఔట్‌పేషెంట్ (ఓపీ) విభాగానికి వచ్చే రోగుల సంఖ్యకు తగ్గట్టు గదులు లేకపోవడంతో గంటల కొద్ది వైద్య విద్యార్థులు నిల్చోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్లేగ్రౌండ్ లేకపోవడంతో విద్యార్థులు స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించుకోలేకపోవడంతోపాటు ఆటలు ఆడుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

# ఫార్మా భూముల్లో మరో ప్రాజెక్టు!

- నేడు కుర్మిద్దలో ఎన్ఐఏఎంకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- ఫార్మాతో సంబంధం లేని వాటికి భూములు కేటాయించడంపై అన్నదాతల్లో ఆగ్రహావేశాలు



హైదరాబాద్, అక్టోబర్ 18 : ఫార్మాసిటీ కోసం గత బీఆర్ఎస్ సర్కార్ సేకరించిన భూములను రేవంత్ సర్కార్ నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాజెక్టులకు కేటాయించడంపై రైతులకు ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తాజాగా సోమవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కుర్మిద్ద అనుబంధ గ్రామమైన మర్లకుంటతండాలో ఫార్మాతో సంబంధం లేని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుకు సోమవారం శంకుస్థాపన చేయనుండటం విమర్శలకు తావిస్తున్నది.అలాగే ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను ప్రారంభించనున్నారు. ఫార్మాసిటీని రద్దు చేసి, ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, అధికారంలోకి రాగానే రేవంత్ ఆ హామీని తొక్కారు. భూముల విషయమై రైతులు హైకోర్టుకు వెళ్లడంతో ఫార్మా అనుబంధ కంపెనీలు మాత్రమే ఏర్పాటుచేస్తామని కోర్టుకు అఫిడవిట్ ఇచ్చి మరీ.. బయట మాత్రం ఫార్మాసిటీ రద్దు అంటూ ఫ్యూచర్‌సిటీకి తెరతీయడం రైతులను కలవరపెడుతున్నది.ఒకవేళ ఫార్మాసిటీ రద్దు చేస్తే బహిర్గతం చేయాలని, కోర్టుకు కూడా అదే విషయం స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రైతుల పట్టా భూములను బలవంతంగా తీసుకోవద్దని కోర్టు స్టే ఉన్నప్పటికీ ప్రభుత్వం పోలీసు బలగాలను మోహరించి గుంజుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను వాటికే వినియోగించాలని, కాదని ఇతర కంపెనీలకు కేటాయిస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని పలుమార్లు ప్రభుత్వానికి తేల్చిచెప్పారు. అంతేగాక తమ ప్రభుత్వం ఏర్పడ్డాక ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తామని స్పష్టంచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఫార్మాకు సంబంధం లేని ప్రాజెక్టుకు కట్టబెడుతున్నది.

# మెడికోలను చిదిమేస్తున్న ఒత్తిడి..

- అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న యువ వైద్యులు
- రాష్ట్రంలో వరుస ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనం
- నివారణకు చర్యలు తీసుకోవాలంటున్న నిపుణులు

హైదరాబాద్, అక్టోబర్ 18 : వైద్య విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయడంతోపాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలనుకుంటున్న యువ వైద్యుల సంకల్పాన్ని ఒత్తిడి చిదిమేస్తున్నది. రాష్ట్రంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న మెడికోల ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని కొందరు, పీజీ సీటు రాలేదని మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నెలలు గడుస్తున్నా సెలవులు ఇవ్వడంలో జాప్యం, దీర్ఘకాలిక పనివేళలు, తీవ్రమవుతున్న పని ఒత్తిడి కారణంగా యువ వైద్యులు అర్ధాంతరంగా తమ జీవితాలను ముగిస్తున్నారు. మరో వైపు ర్యాగింగ్, వేధింపులు సైతం మెడికోల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి.మెడికోలు తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులకు ఓర్చి తమ పిల్లలను ఉన్నత స్థానంలో నిలుపాలని కలలు కన్న తల్లిదండ్రులకు శోకాన్నే మిగుల్చుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా మెడికోల ఆత్మహత్యలపై జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఇటీవల సీరియస్ అయ్యింది. మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలపై ప్రతినెలా సమగ్ర రిపోర్టు అందజేయాలని దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలను ఆదేశించిందంటే పరిస్థితి తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఘటన తర్వాత తాత్కాలిక ఉపశమనంతో సరిపెట్టకుండా.. రాష్ట్రస్థాయిలో మెడికోల ఆత్మహత్యల నివారణకు పకడ్బందీ వ్యవస్థను తీసుకురావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతి వైద్యకళాశాల, బోధనాసుపత్రుల్లో గోప్యతతో కూడిన మానసిక ఆరోగ్య సేవలు



అందుబాటులో ఉంచాలి. ఇంటర్న్, పీజీల డ్యూటీ సమయాలు, సెలవులను సమీక్షించాలి. ర్యాగింగ్, అవమానం, వేధింపులపై ఫిర్యాదుకు సమగ్ర వ్యవస్థ ఉండాలి. మెడికోలపై అధిక పనిభారం, పరీక్షల ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను సున్నితంగా పరిశీలించాలి.

# చిరు వ్యాపారులపై ప్రతాపం




హైదరాబాద్, అక్టోబర్ 18 : ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల పేరిట పద్మారావు నగర్ గాంధీ ఆస్పత్రి వెనకాల వైపు చిరువ్యాపారాలను ఆదివారం తొలగించారు. పద్మారావునగర్ నుంచి ముషీరాబాద్ వరకు ఫుట్‌పాత్‌లపై కొందరు చిరు వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యాపారాల కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ.. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు వ్యాపారాలను తొలగించారు. దీంతో ఉపాధి కోల్పోయామంటూ.. చిరు వ్యాపారులు ఆవేదన చెందారు.

# గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి




## ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 18 : అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం మల్లాపూర్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎండీ ఉస్మాన్ -- టీమ్ బీఎల్ఆర్ ఆధ్వర్యంలో ఫారం-18 ఓటరు నమోదు సహాయ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా 70 మందికి పైగా పట్టభద్రులు తమ పేర్లను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి హాజరై పట్టభద్రుల నమోదు కార్యక్రమానికి తమ మద్దతు, ప్రోత్సాహాన్ని అందించారు. ఎండీ ఉస్మాన్ మాట్లాడుతూ.. శిబిరానికి విచ్చేసి కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఫారం-18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు.

# థార్ కారు బీభత్సం.. బైక్‌ను ఢీకొని ఇద్దరు దుర్మరణం




హైదరాబాద్, అక్టోబర్ 18 : హైదరాబాద్ హయత్‌నగర్‌లోని విజయవాడ జాతీయ రహదారిపై థార్ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన థార్ కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న రేఖ తన నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని తన సోదరుడు నవీన్‌తో కలిసి పెద్ద అంబర్‌పేటలోని పుట్టింటికి బయల్దేరింది. బైక్‌పై బయల్దేరిన వారు హయత్‌నగర్‌కు చేరుకోగానే.. వేగంగా వచ్చిన థార్ కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రేఖ, నవీన్ అక్కడికక్కడే మృతిచెందారు. నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఇది గమనించిన స్థానికులు 108 సాయంతో చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. బతుకమ్మ, దసరా పండుగల కోసం పుట్టింటికి వెళ్తుండగా ప్రాణాలు కోల్పోవడంతో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు.. ఓ పోలీసు అధికారికి చెందినదిగా గుర్తించారు.

# టైగర్‌ష్రాఫ్‌పై కాల్పులు.. తీవ్రంగా గాయపడిన డ్రైవర్



ముంబై : బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు జరగడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆదివారం సాయంత్రం ముంబైలోని జుహు ప్రాంతంలో కారులో వెళ్తుండగా ముగ్గురు బైక్‌పై వచ్చి కాల్పులు జరిపారు. ఈ దాడిలో కారు డ్రైవర్‌తో పాటు ఆటోడ్రైవర్ కూడా గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తున్నది. నటుడు టైగర్‌ష్రాఫ్ క్షేమంగా ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఆ దుండగులు ఎవరు అనే కోణంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఈ కాల్పులు జరిపింది తామే అని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన అనిల్ పండిత్, హర్మన్ సంధుల పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ దర్యాప్తునకు ఆదేశించారు.

# విశ్రాంత ఐపీఎస్ సతీమణి హత్య కేసులో పురోగతి!



హైదరాబాద్, అక్టోబర్ 18 : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి సతీమణి తనూజ రంజన్ హత్య కేసులో ప్రధాన నిందితురాలు కల్పన అలియాస్ ధర్మతో పాటు మరో ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో నివాసం ఉండే విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్‌రంజన్ రే సతీమణి తనూజా రంజన్(61)ను మే 8న దారుణంగా హత్యచేసిన నేపాలీ గ్యాంగ్ సభ్యులు చోరీకి పాల్పడి పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో తనుజా రంజన్ ఇంట్లో పనిమనిషిగా చేరిన నేపాలీ గ్యాంగ్ సభ్యురాలు కల్పన అలియాస్ ధర్మ(30)తో పాటు సురేశ్‌షాహీ అలియాస్ సృజన్ షాహీ, గణేశ్ బికాస్, కంచా లామాతో మరో నలుగురు వ్యక్తులను నిందితులుగా గుర్తించిన పోలీసులు వేట ప్రారంభించగా నిందితులందరూ చోరీ సొత్తును పంచుకుని వేర్వేరు మార్గాల్లో నేపాల్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రత్యేక పోలీసు బృందాలు నేపాల్‌కు వెళ్లినా నిందితులను పట్టుకోలేకపోయారు. ఇదిలా ఉండగా ఈ కేసులో ఓ నిందితుడు సునీల్ పర్యార్(29)ను రెండునెలల క్రితం అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు అతడిపై పీడీ యాక్ట్ ప్రయోగించిన సంగతి తెలిసిందే. కాగా ఈ కేసులో పరారీలో ఉన్న మరో ఏడుగురు నిందితులను పట్టుకునేందుకు మూడునెలలుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు ప్రత్యేక బృందం కల్పనతో పాటు ఇతర నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. కాగా తనూజా రంజన్ హత్య తర్వాత నేపాల్‌లో తలదాచుకున్న కల్పనతో పాటు మరో ముగ్గురు నిందితులు మరో చోరీకి స్కెచ్‌వేసి వేర్వేరు మార్గాల్లో నేపాల్ నుంచి యూపీ, బిహార్, ఢిల్లీ ప్రాంతాలకు చేరుకున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వేర్వేరు బృందాలు రంగంలోకి దిగి వివిధ ప్రాంతాల్లో తలదాచుకున్న కల్పనతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురు నిందితులను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకువచ్చిన పోలీసులు విచారిస్తున్నారు. చోరీలో పాల్గొన్న మిగిలిన వారి ఆచూకీతో పాటు చోరీ సొత్తు ఎక్కడ విక్రయించారు.. తదితర అంశాలపై విచారణ కొనసాగుతోంది. ఒకటిరెండు రోజుల్లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సోనీది ప్రమాదం కాదు.. ముమ్మాటికీ యాజమాన్య హత్యే

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆగ్రహం
- బాధితులకు చెరొక రూ. కోటి పరిహారం చెల్లించాలి
- యాజమాన్యంపై నాన్-బెయిలబుల్ కేసులు పెట్టాలని డిమాండ్



హైదరాబాద్, అక్టోబర్ 18 : రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబురాల పేరుతో నిర్వహించిన ఈవెంట్ విద్యార్థినుల పాలిట బలిపీఠంగా మారిందని, ఇది ముమ్మాటికీ యాజమాన్యం చేసిన హత్యేనని ప్రముఖ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. ఈ దుర్ఘటనలో వనపర్తి జిల్లాకు చెందిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని సోని ప్రాణాలు కోల్పోగా, మరో విద్యార్థిని మీనా తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య పోరాడుతున్న ఘటనపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో పేదల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. వేలాది మంది విద్యార్థులతో కార్పొరేట్ విద్యాసంస్థలు ఈవెంట్లు నిర్వహిస్తూ వినోద వ్యాపారం చేస్తున్నాయని, అసలు ఎలాంటి అనుమతులు లేకున్నా స్థానిక పోలీసులు, విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్సీ శ్రవణ్ నిలదీశారు. ప్రభుత్వ కళ్లెదుటే భద్రతా నిబంధనలను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. కనీసం ఫైర్ సేఫ్టీ లేదని, క్రౌడ్ కంట్రోల్ చర్యలు శూన్యమని, అత్యవసరానికి అంబులెన్స్ కూడా అందుబాటులో లేకుండా వ్యవహరించడం దారుణమన్నారు. టికెట్ల ద్వారా సొమ్ము వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈవెంట్లను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ పాలనా వైఫల్యమేనని ఆయన ఆరోపించారు. దాదాపు రూ. 50 లక్షల ఫీజులు గుంజి, పేద విద్యార్థుల ప్రాణాలను గాలికొదిలేసిన కాలేజీ యాజమాన్యంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఉదాసీనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు.

# తాగునీరు వృథా చేస్తే ఊరుకోం..

## జూబ్లీహిల్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా!




హైదరాబాద్, అక్టోబర్ 18 : తాగునీటిని దుర్వినియోగం చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హైదరాబాద్ జలమండలి స్పష్టం చేసింది. నీటి వృథాపై అందిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్‌లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై అధికారులు చర్యలు తీసుకున్నారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రూ.20 వేల జరిమానా విధించడంతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించారు. కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల ద్వారా అందించే నీటి సరఫరాను కూడా నిలిపివేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఉన్న ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. నీటి దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తించడంతో పబ్ యాజమాన్యంపై చర్యలు తీసుకున్నారు. జరిమానాతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తొలగించి, కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల సరఫరాను నిలిపివేశారు. వేసవిలో తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు తాగునీటిని వృథా చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరింది. నీటి దుర్వినియోగాన్ని ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నగరంలో ఎక్కడైనా తాగునీటి వృథా లేదా దుర్వినియోగం కనిపిస్తే ప్రజలు జలమండలికి వాట్సాప్: 99499 30003, కస్టమర్ కేర్: 155313 నంబర్ల ద్వారా సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఫిర్యాదుతో పాటు ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ప్రాంతం, పూర్తి చిరునామాను పంపించాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని జలమండలి హామీ ఇచ్చింది.

# దసరాకు ఊరెళ్తున్నారా జాగ్రత్త..!

- గ్రేటర్‌లో దొంగల కలకలం
- గ్రేటర్‌లో దొంగల కలకలం..
- తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా చోరీల ముప్పు
- పండుగ వేళ అప్రమత్తతే అసలైన రక్షణ
- ఇంటి భద్రతపై నిర్లక్ష్యం వద్దు



హైదరాబాద్, అక్టోబర్ 18 : ): దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు నగరవాసులు సిద్ధమవుతు న్నారు. ఇప్పటికే చాలామంది కుటుంబాలతో కలిసి పల్లెబాట పట్టగా, మరికొందరు ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఇండ్లకు తాళాలు వేసి రోజుల తరబడి దూరంగా ఉండే పరిస్థితులను దొంగలు తమకు అనుకూలంగా మార్చుకునే ప్రమాదం లేకపోలేదు. గతనెలలో సైబరాబాద్ , మలాజిగిరి పోలీసు కమిషనరేట్ల పరిధిలో చోటుచేసుకున్న వరుస దొంగతనాల నేపథ్యంలో పండుగ సెలవులు పోలీసులకు మరో సవాలుగా మారుతున్నాయి. ప్రజలు పండుగ సంబరాల్లో నిమగ్నమయ్యే వేళ తమ ఇండ్ల భద్రతను విస్మరిస్తే, తిరిగి వచ్చేసరికి విలువైన వస్తువులు మాయమయ్యే ప్రమాదం లేకపోలేదు. నగరంలోని అపార్ట్‌మెంట్లు, కాలనీలు, విల్లాలు, శివారు ప్రాంతాల్లోని నివాస గృహాలే దొంగల లక్ష్యంగా మారే అవకాశం ఉంది. ఇంటికి తాళం వేసి ఉందా? వరుసగా ఎన్ని రోజుల నుంచి ఎవరూ రావడం లేదా? పరిసరాల్లో కదలికలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను గమనిస్తూ రెకీ చేసే దొంగలు, అనువైన సమయం చూసుకుని చోరీలకు పాల్పడే ప్రమాదం ఉంది. ఇటీవల జరిగిన నార్సింగి చడ్డీ గ్యాంగ్ ఘటన, హయత్‌నగర్‌లోని నగల దుకాణం చోరీ, ఇళ్లలో జరిగిన వరుస చోరీలు తదితర వరుస ఘటనలే ఇందుకు నిదర్శనం. దసరా సమయంలో నగరంలోని అనేక కుటుంబాలు ఒకేసారి స్వగ్రామాలకు వెళ్లడం, కొన్ని నివాస ప్రాం తాల్లో రాకపోకలు తగ్గడం భద్రతాపరమైన ఇబ్బందులకు దారితీయవచ్చు. మరోవైపు పండుగ వేడుకలు, రద్దీ ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి విధుల మధ్య నివాస ప్రాంతాలపై నిఘా కొనసాగించడం పోలీసు లకు సవాలే. అయితే పోలీసుల అప్రమత్తతతో పాటు ప్రజల సహకారం కూడా అంతే అవసరం. కాలనీల సంక్షేమ సంఘాలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, సెక్యూరిటీ సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తే అనుమానాస్పద కదలికలను త్వరగా గుర్తిం చే అవకాశం ఉంటుంది.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

## అంబరాన్నంటిన సద్దులు..

ట్యాంక్‌బండ్‌తో వద్ద నిర్వహించిన వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనగా, ఆయా ప్రాంతాలు పూలవనాలను తలపించాయి. కాగా, పలుచోట్ల ప్రభుత్వం బతుకమ్మ పండుగ కోసం విద్యుద్దీపాలు ఏర్పాటుచేయకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. హుస్సేన్‌సాగర్ తీరాన ట్యాంక్‌బండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. ఆటాపాటలు.. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు.. లేజర్ షో, బాణసంచా వెలుగులతో ఆ ప్రాంతమంతా ధగధగా మెరిసిపోయింది. ఎటుచూసినా పండుగ సందడే కనిపించగా, నగరవాసులు ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలు, కోలాటంతో పరిసరాలన్నీ మార్మోగాయి. గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతకతోపాటు ప్రముఖ సినీనటులు రష్మిక మందన్న-విజయ్ దేవరకొండ దంపతులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ వేదికలపై కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. లేజర్‌షో, బాణసంచా కాంతులు ఆకాశంలో రంగుల హరివిల్లును ఆవిష్కరించాయి.

## భక్తులపైకి దూసుకెళ్లిన లారీ.. 15మంది దుర్మరణం

గ్వాలియర్ జిల్లాలో శీతలామాత ఆలయం వద్ద చోటుచేసుకుంది. గ్వాలియర్ నగరానికి 20 కి.మీ. దూరంలో శీతలామాత ఆలయం ఉంది. నవరాత్రుల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ క్రమంలో చినోర్ రోడ్డు వైపు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న (పంజాబ్ రిజిస్ట్రేషన్) లారీ దిగువకు వెళ్తూ ఒక్కసారిగా అదుపుతప్పింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తుల పైనుంచి దూసుకెళ్లింది. రహదారి పక్కన ఉన్న తాత్కాలిక దుకాణాలనూ ఢీకొట్టి, చివరకు ఆలయ ప్రవేశద్వారాన్ని బలంగా తాకింది. ఈ ధాటికి ఆలయ ప్రహరీ గోడలో కొంత కూలినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఆలయానికి వెళ్లే మార్గంలో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అయినప్పటికీ లారీ ఆ మార్గంలోకి ఎలా వచ్చిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. పోలీసు బారికేడ్లను దాటి వాహనం ముందుకు వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం. ప్రమాద సమయంలో విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల రోదనలతో ఆస్పత్రుల వద్ద హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. ట్రక్కు యజమాని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, డ్రైవర్ గూగుల్ మ్యాప్ చూసి నిషేధిత మార్గంలోకి వచ్చి ఉంటాడని అధికారులు భావిస్తున్నారు. ఆ క్రమంలోనే బ్రేకుల ఫెయిలై భక్తులపైకి లారీ దూసుకెళ్లి ఉంటుందని అనుమానిస్తున్నారు.

## సీఎం సీరియస్.. పోలీసులపై వేటు

ప్రమాదంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణలు రావడంతో గ్వాలియర్ సిటీ ఎస్పీని పదవి నుంచి తొలగించాలని ఆదేశించారు. మరో ఎనిమిది మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, నిషేధిత మార్గంలోకి లారీ ప్రవేశించడంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

## ఏసీలతో కాలుష్యం.. పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్.. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ నివేదిక!

**హైదరాబాద్, అక్టోబర్ 18 :** గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న నేపథ్యంలో ఏసీల వినియోగం మరో పెద్ద సవాలుగా మారుతోంది. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం,



భవనాల లోపల ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ఏసీలు విస్తృతంగా వాడుతున్నప్పటికీ, అవి వాతావరణానికి అదనపు భారంగా మారాయి. ఇంధన పొదుపు సామర్థ్యం తక్కువగా ఉన్న ఏసీలు, హైడ్రోఫ్లోరోకార్బన్ శీతలీకరణ వాయువులు, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ల కారణంగా గ్లోబల్ వార్మింగ్ మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని నివేదిక స్పష్టం చేసింది. ఒక ఇంట్లో ఏసీ ఉంటే ఆ ఇంటి విద్యుత్ వినియోగం సుమారు 36 శాతం పెరుగుతుందని అధ్యయనం తెలిపింది. 2020లో దేశంలో ఏసీల వాడకం కేవలం 9 శాతం కుటుంబాలకే పరిమితమై ఉండగా, ప్రస్తుతం అది 15 శాతానికి చేరుకుంది. వేడి తీవ్రత, వడగాలులు పెరుగుతున్న కారణంగా 2050 నాటికి ఇది 33 శాతానికి చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ పెరుగుదలను నియంత్రించకపోతే, ఏసీల కారణంగా సగటు ఉష్ణోగ్రత 0.03 నుంచి 0.07 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది. భూతాపం 3 డిగ్రీలు పెరిగితే దేశ తలసరి జీడీపీలో 32 శాతం వరకు నష్టం జరిగే ప్రమాదం ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఏసీల్లో వాడే హెచ్‌ఎఫ్‌సీ వాయువులు ముఖ్యంగా ఆర్-410ఏ వంటివి కార్బన్ డయాక్సైడ్‌తో పోలిస్తే వేల రెట్లు ఎక్కువ గ్లోబల్ వార్మింగ్ పొటెన్షియల్ కలిగి ఉన్నాయి. ఆర్-410ఏ వాయువు కార్బన్ డయాక్సైడ్ కంటే 2,088 రెట్లు ఎక్కువ భూతాపం కలిగించే సామర్థ్యం కలిగి ఉంది. విద్యుత్ వినియోగం కంటే ఈ శీతలీకరణ వాయువుల ఉద్గారాలు వాతావరణాన్ని మరింత తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నివేదిక పేర్కొంది. అయితే పరిష్కార మార్గాలు కూడా ఉన్నాయని నివేదిక సూచించింది. 2033 నాటికి కొత్తగా అమ్మే ఏసీలు అధిక ఇంధన పొదుపు నిబంధనలు పాటించేలా చేస్తే, 2035 నాటికి ఏసీల విద్యుత్ వినియోగాన్ని సంవత్సరానికి సుమారు 86 టెరావాట్ గంటల వరకు తగ్గించవచ్చు. ఇది దేశ మొత్తం విద్యుత్ వినియోగంలో 4 శాతానికి సమానం. ఇంధన సామర్థ్యం ఎక్కువగా ఉన్న ఏసీలను ప్రోత్సహించడం, పాత మోడళ్లను దశలవారీగా నిలిపివేయడం అవసరం. అలాగే పునరుత్పాదక ఇంధన వనరులను వేగంగా విస్తరించాలని నివేదిక సూచించింది. రూఫ్‌టాప్ సోలార్, పవన విద్యుత్ వంటి వ్యవస్థలను భారీ ఎత్తున పెంచితే పవర్ గ్రిడ్‌పై ఒత్తిడి తగ్గుతుంది. భవనాల నిర్మాణంలోనూ మార్పులు రావాలి. లోపలి ఉష్ణోగ్రతలు సహజంగా తగ్గేలా భవన డిజైన్లు, బిల్డింగ్ కోడ్‌లు అమలు చేస్తే ఏసీ అవసరం తగ్గుతుంది. ఇండియాలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో గ్రీన్ బిల్డింగ్ నిబంధనలు, ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్‌లు అమలులో ఉన్నాయి. వీటిని మరింత కఠినంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న ఏసీ మార్కెట్లలో ఒకటి. వేసవి కాలంలో హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో ఏసీ లోడ్ కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోంది.

## నేడు, రేపు ఏపీ, తెలంగాణాలలో వర్షాలు కురుస్తాయన్న బంగాళాఖాతం!

**హైదరాబాద్, అక్టోబర్18:** తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆదివారం, సోమవారం అక్టోబర్ 18, 19 తేదీలలో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మీదుగా ఉపరితల ఆవర్తనం, అలాగే దక్షిణ కోస్తాంధ్ర నుంచి వాయవ్య బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి కారణంగా ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ పరిస్థితి వచ్చే రెండు రోజులు కొనసాగే అవకాశం ఉంది. తెలంగాణలోని ఉమ్మడి జిల్లాలైన ఖమ్మం, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, కరీంనగర్ పరిధిలో వచ్చే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ నగరంలోనూ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వర్షాల ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. అల్లూరి సీతారామరాజు, పోలవరం, కోనసీమ, ఎన్టీఆర్, పల్నాడు, మార్కాపురం, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలు చోట్ల ఉరుములతో కూడిన భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది.

# ఆర్టీసీ స్పెషల్ దోపిడీ

- 50 శాతం అదనపు చార్జీలు
- బతుకమ్మ, దసరాకు సొంతూర్లకు నగరవాసులు
- బస్సుల సంఖ్య సరిపోక ప్రయాణికుల పాట్లు
- హైదరాబాద్ హైవేలపై వాహనాల రద్దీ
- కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్
- ప్రైవేటు వాహనాల్లో ఇష్టారాజ్యం



**హైదరాబాద్, అక్టోబర్ 18 :** బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా నగరవాసులు ఊరుబాట పట్టారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా జరుపుకోవడానికి కుటుంబాలతో సహా నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో ఎప్పుడూ రద్దీని తలపించే భాగ్యనగరం శనివారం బోసిపోయినట్టుగా దర్శనమిచ్చింది. ఒకేసారి లక్షలాది మంది బయలుదేరడంతో ప్రధాన జంక్షన్ల వద్ద గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఎదురైందని చెబుతున్నారు. జేబీఎస్, ఎంజీబీఎస్, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌లు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సమకూరుస్తున్నామని చెప్పినప్పటికీ బస్సులు సమయానికి రాక గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, సిద్దిపేట, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ రద్దీని తలపిస్తున్నాయి. కాగా, ప్రత్యేక బస్సులో 50శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికులకు భారంగా మారింది. సొంతూళ్లకు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బస్సుల్లో నిల్చొని ప్రయాణం చేయాల్సి ఉంటుండటంతో చాలా మంది ప్రయివేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. ఉప్పల్ నుంచి హన్మకొండకు వెళ్లాలంటే ఒక్కరికి రూ.800-12 వందల వరకు క్యాబ్ ధరలు ఉన్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. చాలా వరకు ఆన్‌లైన్‌లో బస్సుల సీట్లు బుక్ చేసుకోవడం కూడా సామాన్య జనాలకు ఇబ్బందిగా మారింది. సీట్లు లేకపోవడంతో మూడు నుంచి నాలుగు గంటల ప్రయాణానికి సైతం నిల్చొనే ప్రయాణం చేస్తున్నారు. నగరంలో 2900 బస్సులుంటే అందులో కేవలం 200 బస్సులు మాత్రమే నగరంలో రాకపోకలు సాగిస్తున్నాయి. మిగిలిన బస్సులన్నీ జిల్లాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. పలు జిల్లాల్లో ప్రయివేట్ డ్రైవర్లతో బస్సులు నడిపిస్తున్నారు. వాహనాలన్నీ హైవేలు ఎక్కుతుండటంతో శనివారం టోల్‌గేట్లు అన్నీ కిటకిటలాడాయి. ప్రభుత్వ, ప్రయివేట్ బస్సులు, కార్లు, బైక్‌లతో జాతీయ రహదారులు పోటెత్తాయి. టోల్ గేట్ల వద్ద వాహనాలు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. పలు టోల్ ప్లాజాల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినా వాహనాల రద్దీ మాత్రం తగ్గలేదు. ఫలితంగా గంటల తరబడి నెమ్మదిగా సాగుతున్న ప్రయాణంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ జాతీయరహదారి 65పై టోల్ ప్లాజా వద్ద భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఫాస్టాగ్ బ్యాలెన్స్ లేకపోవడం, సాంకేతిక సమస్యలు కూడా టోల్ ప్లాజా వద్ద రద్దీకి కారణమయ్యాయని సిబ్బంది తెలిపారు. కాగా, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని చౌటుప్పల్ పరిధిలోని లక్కారం నుంచి వలిగొండ మార్గం మీదుగా చిట్యాలకు చేరుకునేలా వాహనాలను ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లించారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు సైతం కిలో మీటర్ల మేర నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. సాధారణంగా కీసర, చిల్లకల్లు, కొర్లపహాడ్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ సమస్య అంతరాయం కలిగించింది. శనివారం సాయంత్రానికే 60 వేలకు పైగా వాహనాలు వచ్చాయని టోల్‌గేట్ నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఐటీ ఉద్యోగులకు కరెంట్ కష్టాలు!

- అప్రకటిత కోతలతో వర్క్ ఫ్రం హోమ్‌కు ఇబ్బందులు
- ఫిర్యాదులు చేసినా పట్టింపు లేని దక్షిణ డిస్కం సిబ్బంది
- కోతలే లేవంటూ సీఎండీ చెప్పిన తీరుపై మండిపాటు
- నిరంతర విద్యుత్ ఇవ్వాలంటూ ఐటీల డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్ 18 :** మాదాపూర్‌లో నివాసముంటున్న ఒక ఐటీ ఉద్యోగి రెండురోజుల కిందట ఉదయం 9 గంటలకు ల్యాప్‌టాప్ తెరిచాడు. అమెరికాలోని క్లయింట్‌తో సమావేశం ఉంది. మధ్యాహ్ననికి ప్రాజెక్టు సమర్పించాలి. ఉదయం పదిగంటలకు కరెంట్ పోయి సాయంత్రం నాలుగుగంటలకు వచ్చింది. కరెంట్ పోయిన వెంటనే రూటర్ ఆగిపోయింది. ల్యాప్‌టాప్ బ్యాటరీ అయిపోయేలోపు పని పూర్తి చేయాలి. మొబైల్ హాట్‌స్పాట్ పెట్టినా నెట్‌వర్క్ సమస్య వస్తున్నది. ఆన్‌లైన్ మీటింగ్ మధ్యలోనే ఆగిపోవడంతో ఏం చేయాలో తోచక తన పరిస్థితిని మేనేజర్‌కు స్క్రీన్‌షాట్ తీసి పెట్టాడు. రెడిట్ వేదికలో ఒక వినియోగదారుడు విద్యుత్ కోతల కారణంగా ఆఫీసు మీటింగులలో కనెక్షన్ తరచూ తెగిపోతున్నదని, జియో మొబైల్ నెట్‌వర్క్ వేగం కూడా పడిపోతున్నదని రాశారు. అదే చర్చలో దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన మరో వినియోగదారుడు ప్రతీరోజూ కనీసం నాలుగైదుసార్లు తరచూ కరెంట్ పోతున్నదని, దీంతో తమ ఉద్యోగాలు చేసుకోవడం చాలా కష్టంగా ఉంటున్నదని చెప్పారు. ఇది హైదరాబాద్ వంటి గ్లోబల్‌సిటీకి చాలా చెడ్డపేరు తెస్తుందని టెకీలు ఆవేదన వ్యక్తం చేశారు. షేక్‌పేటలోని లక్ష్మణ్‌నగర్ ప్రాంతంలో ఉదయం పదిన్నర నుంచి కరెంట్ లేదు. మధ్యలో రెండుమూడుసార్లు ఒక అరగంట పాటు వచ్చి పోయింది. మరికొన్ని సార్లు కొన్ని సెకన్లు మాత్రమే పవర్ వచ్చి పోతున్నదని ఐటీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాము ఫిర్యాదు చేసినా ఏఐ సమాధానం వస్తున్నదే తప్ప.. సమస్యను పరిష్కరించే సిబ్బంది మాత్రం రావడం లేదని, దీంతో తమ వర్క్ మధ్యలోనే ఆగిపోయి ఉద్యోగపరంగా చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని కొందరు ఉద్యోగులు చెప్పారు. గతంలో వేసవికాలంలో విద్యుత్‌కోతలపైనే చర్చ జరిగేది. కానీ ఇప్పుడు వర్షాకాలం దాటుతున్న సమయంలోనూ అప్రకటిత కోతలు నగరవాసులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రత్యేకించి జాబ్ చేసే సమయంలో కరెంట్ కోతలతో పడుతున్న ఇబ్బందులను సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టి సమస్యలను ప్రస్తావిస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్న కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతున్నప్పుడే కరెంట్ సరఫరా నిలిచిపోయిన పరిస్థితిపై సోషల్‌మీడియా కాంగ్రెస్ వచ్చింది కరెంట్ పోయిందంటూ.. ఎద్దేవా చేస్తూ ట్రోల్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మొట్టమొదటి ప్రాధాన్యత విద్యుత్‌కు ఇచ్చిన కేసీఆర్ రాష్ట్రంలో రెప్పపాటు కరెంట్ పోకూడదంటూ విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేశారు. అప్పటి డిమాండ్ కంటే మరో ఆరేండ్ల ముందు డిమాండ్‌ను ఊహించి గ్రిడ్ విఫలమైనా కరెంట్ పోకుండా పవర్ ఐలాండ్‌ను ఏర్పాటు చేశారు. ఇంత పటిష్టమైన వ్యవస్థ రెండేండ్లుగా నిర్వహణలోపాలతో దెబ్బతిన్నదని కొందరు సీనియర్ విద్యుత్ ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. కరెంట్ డిమాండ్ పెరగడం వాస్తవమే అయినా దానిని తట్టుకొనగలిగే సామర్థ్యాన్ని పెంచుకోవలసిన అధికారులు ఆ దిశగా ఆలోచనలు చేయకుండా కేవలం మాటలకే పరిమితమవుతూ కమీషన్ల కోసం పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## ప్రపంచ టాప్ శాస్త్రవేత్తల లిస్టులో

# డాక్టర్ పత్తిపాటి ఉషారాణి

- కీటకశాస్త్ర విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 341వ ర్యాంక్
- ఐఐసిటీ విశ్రాంత శాస్త్రవేత్తకు దకిన అంతర్జాతీయ గౌరవం
- స్టాన్ ఫోర్డ్ -- ఎల్సెవియర్ జాబితా ఆధారంగా టాప్ సైనెట్ ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 18 :** ప్రపంచంలోని అగ్రగామి శాస్త్రవేత్తల జాబితాలో సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), హైదరాబాద్ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ పత్తిపాటి ఉషారాణి చోటు సంపాదించారు. 2026 సంవత్సరానికి గానూ అంతర్జాతీయంగా పేరుపొందిన 'టాప్ సైనెట్' ప్రచురించిన ప్రపంచ టాప్ 2% శాస్త్రవేత్తల సింగిల్-ఇయర్ ర్యాంకింగ్‌లో ఆమె ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. కీటకశాస్త్రం ఉపవిభాగంలో అంతర్జాతీయ స్థాయిలో ఆమె 341వ ర్యాంకును సాధించి దేశానికీ, విభాగానికీ పేరుప్రతిష్ఠలు తెచ్చారు. అమెరికాలోని ప్రముఖ స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ సంస్థ సంయుక్తంగా సేకరించిన ప్రామాణిక నివేదికల ప్రాతిపదికన ఈ ర్యాంకింగ్‌ను రూపొందించారు. డాక్టర్ ఉషారాణి జీవశాస్త్ర రంగంలో, ముఖ్యంగా కీటకశాస్త్ర విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలందించారు. రసాయన పర్యావరణ శాస్త్రం జీవ ఆధారిత పురుగు మందులు , నానోబయోటెక్నాలజీ విభాగాల్లో



ఆమె వినూత్న పరిశోధనలు నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించని, సుస్థిరమైన చీడపీడల నివారణ పద్ధతులను కనుగొనడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. కీటకాల ప్రవర్తన, వాటి నియంత్రణపై సాధించిన విజయాలకు గానూ గతంలోనూ ఆమె అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. తన శాస్త్రీయ ప్రయాణంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో 130 పరిశోధనా వ్యాసాలు, 17 పుస్తక అధ్యాయాలను ప్రచురించిన డాక్టర్ ఉషారాణి, దాదాపు 10 మంది పీహెచ్ డీ పరిశోధకులకు మార్గదర్శకత్వం (గైడ్ ) వహించి నూతన శాస్త్రవేత్తల తయారీకి విశేష కృషి చేశారు.